

# కథా కౌముది

## గెలుపు

డి.వి.జి.శంకరరావు

**రాష్ట్రంలో** శాసనసభ ఎన్నికల ఫలితాలు వెలువడుతున్నాయి. మెజారిటీ స్థానాల్లో నేటివరకూ ప్రతిపక్షంగా ఉన్న పార్టీ దూసుకుపోతోంది. అధికార పక్షం తరపున నేను పోటీ చేశాను. నేను ఖచ్చితంగా గెలవబోతున్నట్టు చాలా సర్వేలు చెప్పాయి. ఫలితాలు పూర్తిగా తెలిసేవరకూ ఏం చెప్పలేం కదా! మా అనుచరుల్లో ఒకటే ఉత్కంఠ.

నేను పారిశ్రామిక వేత్తని. అధికార పార్టీలో సీనియర్ సభ్యుణ్ణి. అధిష్టానం వద్ద పలుకుబడి ఉన్నవాణ్ణి. అయితే మా పార్టీ శాసనసభ్యుడు నారాయణరావు నాకు ఏకు మేకై కూర్చున్నాడు. ఎవరి మాటా వినడు. నిజాయితీ తెచ్చిన అహంకారం అది. ఆయన్ని ఓడించడమే నా ధ్యేయమైపోయింది. మా ఫ్యాక్టరీలో సమ్మె జరిగిన సమయంలో నారాయణరావు కార్మికుల పక్షమే నిలిచాడు. అధిష్టానం చెప్పినా లెక్కచెయ్యలేదు. తద్వారా నాకు ఆర్థిక నష్టం.

ఆరు మాసాల క్రితం అధినేతని కలిసి ఈసారి ఎన్నికల్లో నిలబడ్తానని చెప్పాను. ఆయన ఖచ్చితంగా కుదరదని చెప్పేశారు. "నారాయణరావుకి ప్రజాబలముంది. సిట్టింగ్ సభ్యుడు. ఆయన్ని మారిస్తే తప్పుడు సంకేతాలొస్తాయి. మీరు ఒక పని చెయ్యండి. మన ప్రభుత్వమొస్తే ఏదైనా నామినేటెడ్ పదవి తీసుకుందురుగానీ."

అధిష్టానంతో లాభం లేదు. జిల్లా స్థాయిలోనే చక్కపెట్టాలి అనుకున్నాను.

జిల్లా నేతలు, పరిశీలకులు సులభంగానే ప్రసన్నమయ్యారు.

"చెప్పన్నా! నారాయణరావుకి వ్యతిరేకంగా సంతకాలు పెట్టి అధిష్టానంపై వత్తిడి తెద్దామా?" రహస్య సమావేశంలో ముఖ్యులడిగారు.

'అప్పుడే వద్దు. సమయం చూసి చెప్తా'నన్నాను.

నారాయణరావుకి ఒకటే మైనస్. డబ్బులేదు. ఆయన పలుకుబడికి ఇండిపెండెంట్‌గా నిల్చున్నా గెలిచే అవకాశాలున్నాయి. అయితే నేటి రాజకీయాల్లో డబ్బులేకుండా గెలవడం చాలా కష్టం. ఆయన అధికార పార్టీ సభ్యుడు కనుక పార్టీ ఆ విషయాల్ని చూసుకుంటుంది. ఒకవేళ పార్టీ తనకి టికెట్ ఇవ్వకపోతే ప్రతిపక్షమైనా ఆయన్ని కళ్ళకద్దుకుని తమ తరపున నిలబెడ్తుంది. ఆ మాత్రం ఆసరా ఉంటేచాలు నారాయణరావుని ఓడించడం వల్లకాదు ఆయన్ని ఓడించాలంటే ఆయనకు ఈ రెండు పార్టీల్లో టిక్కెట్ రాకూడదు. ఈ రాష్ట్రంలో ఈ

రెండే బలమైన పార్టీలు. మిగతావి నామ మాత్రమే. ఆయన ఓటమే నా గెలుపు. అందుకనే తొందర వద్దన్నాను. అనుకున్నట్టే ఎన్నికలు బాగా దగ్గరకొచ్చేశాయి. నామినేషన్లు మొదలైనాయి. ప్రతిపక్షం తన అభ్యర్థిని ప్రకటించేసింది. ఇలా నేతల్ని ఇక రంగంలోకి దూకమన్నాను. వారంతా అధినేతకు తెగేసి చెప్పారు. నారాయణరావుగారి దగ్గర డబ్బులేదు. ఆయన మొండితనంతో చాలామంది స్వంత పార్టీ మనుషుల్ని దూరం చేసుకున్నారు. ఆయనపై చాలా అసంతృప్తి ఉంది. ప్రతిపక్ష అభ్యర్థి డబ్బు దండిగా పట్టుకుని రంగంలోకి దిగాడు. ఆయనతో ఢీకొనే సామర్థ్యం మన కాబోయే అభ్యర్థికి ఉండాలి. లేదా మునిగిపోతాం. అధిష్టానం తలొగ్గింది. నాకు సీటు కేటాయించింది. ఇదే అసలు విజయం అనుకున్నాను. హడావిడిగా నామినేషన్ దాఖలు చేశాను. స్వంత బలాన్నీ, పార్టీ బలాన్నీ సర్వశక్తుల్నీ కేంద్రీకరించాను.

అయితే ప్రమాదం ఊహించని కోణంలో వచ్చింది. నారాయణరావు స్వతంత్ర అభ్యర్థిగా రంగంలోకి దిగాడు. వివిధ సేవాసంస్థలు, మిగతా పార్టీలు ఆయనకు బహిరంగంగానే మద్దతు ప్రకటించాయి. ఆయన వ్యక్తిగ ఇమేజితో ద్విముఖ పోరు కాస్తా త్రిముఖ పోరుగా మారింది. పరిమిత వనరులతో ప్రచారంలో వెనుకబడ్డా పోటీలో మాత్రం ముందు వరసకు వచ్చేశాడు. అయినా అవకాశాలు నాకే ఎక్కువ. ఖర్చుకూడా నాదే ఎక్కువ కదా!

ఒకరోజు భారీ బహిరంగ సభ ముగించుకు వస్తున్నాను. దారిలో నారాయణరావు, వారి కొద్దిమంది అనుచరులూ. పొలం పనులు చేసుకుంటున్న వారిని ఒక దగ్గర చేర్చి ప్రచారం చేస్తున్నారు. ప్రచారంలా లేదది నలుగురు స్నేహితులు కలిసి మాట్లాడుకుంటున్నట్టు కనపడుతోంది. నా అనుచరులు కూడా ఆయన్ని చూసి నమస్కారం పెట్టారు. గమనించాను. నా పట్ల వారికి గౌరవం మాత్రమే. ఆయనంటే అభిమానం కూడా. మొత్తం ప్రచారం పార్టీల సిద్ధాంతల మీదే జరుగుతూ వస్తోంది. మా నియోజకవర్గం వరకూ వ్యక్తిగత దూషణలు చెయ్యడం ఆయనకి నచ్చదు. ఆయన్ని తిట్టడానికి మాకు కారణం లేదు. 'ఆయనకు ఓటెయ్యడమంటే ఓటుని వృధా చెయ్యడమే. ఎందుకంటే మా పక్షమే అధికారంలోకి వస్తుంది సుపరిపాలన తెస్తుంది' అంటూ ప్రచారం ముమ్మరం చేశాను. ముఖ్య ప్రతిపక్ష సభ్యుడూ అంతే. మా పార్టీపై విమర్శల్ని గుప్పిస్తూ ఆయన్ని నిర్లక్ష్యం చేశాడు. నారాయణ రావు పోటీలో ఉండడం వల్ల మా యిరు పార్టీలకూ ఖర్చు పెరిగింది. ఛాన్స్ తీసుకోదల్చుకోలేదు. అన్ని విధాలా జాగ్రత్తలు తీసుకుంటున్నాను. నారాయణరావు వెనక నేను పెట్టిన కోవర్టులు కూడా చక్కగా విధి నిర్వహణ చేస్తున్నారు. ఇంకా ఓటింగు రెండురోజులుందనగా షాకింగు సమాచారం నా స్వంత మనుషులు చెప్పారు. "అన్నా మీ ఓటు బ్యాంక్ నిట్టనిలువుగా చీలిపోయింది. త్రిముఖ పోరులో ప్రతిపక్ష పార్టీ అభ్యర్థి ముందుకు దూసుకుపోయాడు. గెలుపు కష్టమన్నా".

గెలుపుకన్నా ఈ వార్త వినడమే కష్టమైపోయింది. ప్రతిపక్ష పార్టీపట్ల సైలెంట్ వేవ్ కనపడ్డం మొదలైంది. సాలోచనగా తలూపాను.

మా నియోజక వర్గం ఫలితం ప్రకటించబడింది. అత్యధిక మెజారిటీతో నారాయణరావు గెలిచాడు. ప్రతిపక్ష పార్టీ సభ్యుడు ఘొల్లుమన్నాడు. వారి పార్టీ అధికారంలోకి రాబోతుండగా తాను ఓడిపోయినందుకు. పోటీలో నాకు మూడోస్థానం రావడం అన్నది నా అనుచరులూ, నా కుటుంబమూ జీర్ణించుకోలేకపోతోంది. అభావంగా ఉన్న నన్ను ఓదార్చుతున్నట్టుగా మా ఆవిడ భుజం తట్టింది.

"చూడండి ఈ మీడియా. నిన్నటివరకూ మిమ్మల్ని ఎంతో పొగిడింది. మీరు ఎన్నికైతే ఎంతమేలో వివరించింది. ఈ రోజు నారాయణరావు విజయం ప్రజా విజయం అంటూ ఎత్తేస్తుంది."

"అంతేకదోయ్. రెండు బలమైన పక్షాల్ని ఒంటిచేత్తో ఎదిరించి గెలవడం ప్రజావిజయమేకదా! మనం పంచిన నోట్లకన్నా ఆయన పంచిన కరపత్రాలు తక్కువే."

ఆశ్చర్యపోతూ "మీకేం బాధలేదా ఓడిపోయినందుకు?" అంది.

"ఎందుకు బాధ ఉండదు? అయినా ప్రజలకు ఆయన అవసరమే ఎక్కువ కదా! మంచిదే"

పైకి అలా అన్నా లోపల బాధేమీలేదు నాకు. ఎందుకంటే ఇద్దరమూ గెలవని పరిస్థితి గ్రహించినప్పుడు మా అంతరంగికుల్ని పురమాయించి నా ఓట్లు కూడా ఆయనకే వేసేటట్లు చేసింది నేను. మా యిద్దరిలో అర్హుడు ఆయనే అని నమ్మాను కనుక గెలుపు నాదే నాలో స్వార్థాన్ని గెలిచాను. ఎన్నికల గెలుపు అహాన్ని తృప్తి పరిచేదేమో కానీ ఈ గెలుపు ఆత్మని సంతృప్తి పరిచింది.

నారాయణరావుని అభినందించడానికి ముందుకు కదిలాను.

COMMENTS